పులిచర్మములు దివ్యభూతిపూఁతలును
పదములగజ్జెలు పసిఁడిపావాలు
రుదురాక పేరులు రుద్రమాలికలు
యోగపట్టెలు మంచియోగదండములు
శ్రీ గురుమూర్తులై చెలఁగు శంఖములు
చిమ్మటవాద్యముల్ శ్వేతఢక్కాములు
గుమ్మటిదండెలు కూర్మవీణెలును
పిడిగంటలును బెఱ్ఱబిరుదువాద్యములు
బడిబడి కంచెలు బసవ ఢక్కాములు
ప్రణవనాదమునించు బారిసంకులను
గణుతింప నీరీతిగల జంగమములు
పుడమి యీనినయట్లు భువియెల్ల నిండి
నడలింగమూర్తులై నగరంబుఁజొచ్చి
యారాజవరుఁజూచి యయ్యలిట్లనిరి:
యీరోరి, మాకు నభీష్టంబులైన
యన్నవస్త్రంబులు నాభరణములు
జున్ను నేయునుమంచి జుట్టుపాయసము
ధనధాన్యరాసులు తగినగ్రామములు

భూనాథునిబుద్ధి పూరినిమేసె
నేనాఁటిజంగమో యీప్రొద్దువచ్చి
లంజెనడిగినఁ దాను లంజెలేదనక
కొంజ కాతనిభక్తి కొదువగాకుండ
నిల్లాలి వేశ్యఁగా నిచ్చుచున్నాఁడు
చెల్లునా యిది యేమి చిత్రమున్నావు
నొక్కతెయైన నేఁ డుర్వీశ్వరుండు
నక్కటా, జంగాని కతఁడేలయిచ్చు
నిద్దఱుగాఁగ నాయురువురిసంచు
నొద్దిక చాలక యుంకఁగాఁజూచి
ఇచ్చుచున్నవాఁ డీవు డిటువంటి
కుచ్చితబత్తియుఁ గొనసాగఁగలదె
యిచ్చిన నిద్దఱి నీవలెఁగాని
రెచ్చెంబుగాదటె యొకతె నీతుంగ
ననుచు నిట్టులు కొంద ఱాడుచునుండ
మనకేల యీమాట మానుఁడన్నారు
నాజంగమయ్యయు నాజనవరునిఁ
దేజీలు గజములు దివ్యాంబరములు

